క్లుప్తంగా

నల్లగొండలో పొలం బాట



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిమ్మాపూర్: రైతుల విద్యుత్ సమస్య పరిష్కరించేందుకు విద్యుత్ అధికారులు మండలంలోని నల్లగొండలో సోమవారం పొలంబాట కార్యక్రమం చేపట్టారు. డీఈ ఉపేందర్, నుస్తులాపూర్ ఏడీఈ నరేందర్, ఏఈ రజిత పొలం బాటలో పాల్గొన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో జరుగుతున్న విద్యుత్ ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. రైతుల సమస్యలు తెలుసుకున్నారు. మోటార్ల వద్ద కెపాసిటర్లు వాడడంతో వచ్చు ప్రయోజనాలు, రైతులు అందరు కెపాసిటర్లు బిగించుకుని సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

విగ్రహాల ఆవిష్కరణపై చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరించాలన్న చిత్తశుద్ధి మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్‌ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు లేదని జేఏసీ నాయకులు మాతంగి శంకర్, వంతడుపుల సంపత్, సుగుర్తి జగదీశ్వరాచారి ఆరోపించారు. విగ్రహాల ముసుగులు తొలగించకుండా రెండేళ్లుగా వివక్ష చూపుతున్నారని, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వైఖరి ఖండించారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రికి వినతిపత్రం ఇస్తామని వెళ్లినా తమను పట్టించుకోలేదని ఆరోపించారు. దళితుడైన స్థానిక ఎమ్మెల్యే కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని,మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు కూడా ముసుగులు తొలగించడంలో చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పాశం అశోక్ రెడ్డి, ఎలుక ఆంజనేయులు వడ్లూరి శంకర్ కనకం రాములు లక్ష్మణ్ వర్ణ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భరోసా కల్పించాలి



మొక్కజొన్నను పరిశీలిస్తున్న నాయకులు

చొప్పదండి: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం క్షేత్ర స్థాయిలో పర్యటించి భరోసా కల్పించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి కోరారు. మండలంలోని కాట్నపల్లిలో ఆయన సోమవారం వర్షాలకు నష్టపోయిన పంటలను బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంటలు నష్ట పోయిన రైతులను ఎమ్మెల్యే, మంత్రులు గాని పరామర్శించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వానికి ఆదుకొనే ఆలోచన లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వెంట తోట కోటేశ్, గొల్ల గట్టయ్య, మొగిలి సారయ్య, గన్ను నర్సింహారెడ్డి, సంపత్, విలాసాగరం అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

లోపాలను సవరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్, నాయకులు

శంకరపట్నం: రాజీవ్ యువవికాసం ఆన్‌లైన్ దరఖాస్తులో లోపాలను ప్రభుత్వం సవరించాలని బీజేపీ నాయకుడు శ్రీనివాస్ కోరారు. కేశవపట్నంలో ఆన్‌లైన్ బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ లబ్ధిపొందని వారి పేర్లు ఇప్పటికి ఆన్‌లైన్‌లో కొనసాగడంతో దరఖాస్తులు తీసుకోవడంలేవని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తులు తీసుకునేలా సవరించాలన్నారు. సమావేశంలో శ్రీనివాస్, నసీర్, సమ్మయ్య, రాజ్‌కుమార్, పవన్, శ్రావణ్,కళ్యాణ్, నరసింహా లు పాల్గొన్నారు.

వినియోగించుకోవాలి

హుజూరాబాద్: పట్టణంలోని వరంగల్ రోడ్‌లో భద్రాద్రి బ్యాంక్ శాఖను బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బ్యాంక్ ఒక్క శాఖతో ప్రారంభమై ఇరవై శాఖలకు విస్తరించిందని, తక్కువ వడ్డీకే రుణాలను అందించడం జరుగుతుందన్నారు. అర్హులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామానుజాచార్య, బ్యాంక్ సీఈవో దాసరి వేణుగోపాల్, కిరాణ వర్తక సంఘం ప్రెసిడెంట్ షీలా రాజేంద్రప్రసాద్, బ్యాంక్ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

వైభవంగా మల్లన్న పట్నాలు



తిమ్మాపూర్: రామకృష్ణకాలనీలో పూజల్లో పాల్గొన్న భక్తులు



లక్ష మోదుగు పూల అర్చన

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీలో శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామివారి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఒగ్గు పూజారులు మల్లికార్జున స్వామివారి చరిత్రను కథ రూపంలో చెబుతూ వేడుకలు జరిపారు. అనంతరం అగ్నిగుండం వద్ద శివసత్తులు పూనకాలతో దాటారు. బోనాలు చేసి నైవేద్యం సమర్పించి, భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకాగా పూజారులు ఆశీర్వదించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పోలం అంజయ్య, యాదవ సంఘం అధ్యక్షుడు ఆవుల ఓదెలు, రాజు యాదవ్, సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ శివాలయంలో సోమవారం లక్ష మోదుగు పూలతో మహిళలు అర్చన చేశారు. వేములవాడకు చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో లక్ష మోదుగు పూలు, లక్ష నూలు పోగుల అర్చన నిర్వహించినట్లు ఆలయ అర్చకులు భంగిమఠం శివప్రసాద్ తెలిపారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీసీతా రామచంద్రస్వామిని సోమవారం జమ్మికుంట వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహక అధికారి సుధాకర్ శాలువాలతో దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబాల రాజు, వానరాశి జాన్,



బంగారు గొలుసు బహూకరిస్తున్న దంపతులు

నాంపల్లి రవీందర్, రామంచ స్వామి, చిట్ల రాజు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన మంతెన కృష్ణమూర్తి విమలాదేవి దంపతులు సీతమ్మ విగ్రహానికి బంగారు గొలుసు బహూకరించి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి సుధాకర్, మోహన్, మల్లారెడ్డి,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



గంగాధర: మండలంలోని కురిక్యాల–గర్శకుర్తి ప్రధాన రోడ్డు రంగరావుపల్లి గ్రామ సమీపంలో మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. ఇటీవలే డబుల్‌రోడ్డు వేశారు. కానీ మూలమలుపు వద్ద వాహనాలు సూచిక, హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయలేదు. వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా కాంట్రాక్టరు, అధికారులు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

చిగురుమామిడి: ఉపాధిహామీ కూలీలకు పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ కోరారు. సోమవారం మండలంలోని కొండాపూర్‌లో కూలీల పనిప్రదేశాలను సందర్శించారు. ఈసందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలని, మంచినీటితో పాటు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. చల్లని లేదా ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను పంపిణీ చేయాలని, దూరప్రదేశాలకు వెళ్లే కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. రోజువారి కూలీరేటు వంద నుంచి ఆరువందలకు పెంచాలని సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా కూలీలు



కూలీలతో మాట్లాడుతున్న సృజన్‌కుమార్

ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో వెంట జనార్దన్, లక్ష్మి, రజిత, మాధవి, కనుకవ్వ, శ్రీనివాస్, రాజయ్య పలువురు ఉన్నారు.

క్షయ వ్యాధిపై నిర్మూలనపై అవగాహన ర్యాలీ



జమ్మికుంట: ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది



హుజూరాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్: క్షయ వ్యాధిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి బారినపడమని హుజూరాబాద్ ఆర్ఎంవో సుధాకర్‌రావు అన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. క్షయ వ్యాధి గూర్చి భయపడాల్సిన అవసరం లేదని, సరైన విధంగా మందులు వాడితే వ్యాధ/ పూర్తిగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జరీనా, పంజాల ప్రతాప్, విజేందర్ రెడ్డి, సమ్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్, దేవేందర్‌రెడ్డి, నిషాంత్, సుజాత తదితరులున్నారు.

జమ్మికుంట: మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వావిలాల గ్రామంలో డాక్టర్ రాజేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో సోమవారం క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటతో జ్వరం, తెమడ అలసట వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. వేసవిలో వడ దెబ్బలక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ హెడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్స్ సదానందం, కుసుమ కుమారి, స్టాఫ్ నర్సు సాయికుమార్, ఏఎన్ఎం రమ్య, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో టీబీ డే పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి అవార్డు ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. టీబీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ చేతుల మీదుగా జమ్మికుంట పీహెచ్‌సీ పరిధిలో టీబీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న పడిదం దేవందర్ రెడ్డి సోమవారం రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. గతంలో వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో విధులు నిర్వహించిన సమయంలో టీబీ రోగులకు అందిస్తున్న మెరుగైన సేవలను గుర్తించి అవార్డు అందకోగా మళ్లీ మూడోసారి రాష్ట్రసాయి అవార్డు అందుకున్నారు. స్థానిక వైద్య ఆరోగ్యశాఖ వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

చిగురుమామిడి: రాజ్యాధికారం కోసం దళిత బహుజనులు పోరాటం చేయాలని బీఎస్పీ హుస్నాబాద్ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ కోరారు. సోమవారం సుందరగిరిలో పలువురు బీఎస్పీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉచిత పథకాలు పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒక్కరిపై రెండు లక్షలపైచిలుకు అప్పు ఉందని, యువత కాన్షీరాం, జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానంతో పనిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బీఎస్పీ సీనియర్



మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

నాయకులు మారెపల్లి సుధాకర్, ఎలగందుల శ్రవన్, దివాకర్, ప్రశాంత్, శ్రీనివాస్, కుమార్ పలువురు ఉన్నారు.

పురస్కారం ప్రదానం

గన్నేరువరం: గన్నేరువరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్, రచయిత్రి పబ్బ జ్యోతిలక్ష్మీకి తెలుగు వెలుగు ఉగాది పురస్కారం లభించింది. తెలుగు సాహిత్యంలో అక్షర సేద్యం చేస్తున్న వారందరికి ఉగాది పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలకేంద్రంలో ఆదివారం తెలుగు వెలుగు సాహితి వేదిక ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు పురస్కారం అందజేసి, శాలువా సత్కరించారు.



జ్యోతిలక్ష్మికి పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

జమిలీ ఎన్నికలపై చర్చ జరగాలి

ఇల్లందకుంట: వన్ నేషన్, వన్‌ఎలక్షన్‌తో దేశంలో సమూల మార్పులు వస్తాయని లోక్‌సభ, అసెంబ్లీకి కలిపి దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే వృథా ఖర్చులు భారీగా తగ్గి ప్రభుత్వ ఖజానా ఆదా అవుతుందని బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వన్‌నేషన్, వన్ ఎలక్షన్ వర్క్‌షాపు పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే సమయంతో పాటు ప్రజాధనం వృథాకాదని అన్నారు.1999లో లా కమిషన్ నివేదిక ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానాన్ని లేవనెత్తినా ఆచరణలోకి రాలేదన్నారు. ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులు చేపట్టడానికి జమిలీ ఎన్నికలు తీసుకురావల్సిన అవసరం ఎంతైనా ఉందని మోదీ ప్రభుత్వం భావించిందన్నారు. కొన్ని పార్టీలు జమిలీ ఎన్నికలపై మద్దతు తెలుపుతుంటే మరికొన్ని వ్యతిరేకిస్తూ పనికిమాలిన



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి, నాయకులు

రాజకీయాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. జమిలీ ఎన్నికలపై ప్రజల్లో చర్చ జరుగాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, రాంబాబు, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, ఉప్పుల రమేష్, కంకణాల రవీందర్‌రెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, గురుకుంట్ల సాంబయ్య, కంకణాల సురేందర్‌రెడ్డి, ఎండీ షఫీ, లింగారెడ్డి, రావుల విజయ్‌బాబు, పాపిరెడ్డి, మురహరి గోపాల్, శ్రీనివాస్, దుర్గయ్య, దేవేందర్, సంపత్, సంజీవ్, తిరుపతి, గుడికందుల రమేష్, జంగంసమ్మయ్య పాల్గొన్నారు.

నూతన కమిటీ



శంకరపట్నం: శంకరపట్నం ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు టీయూడబ్ల్యూజే జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి కొరిమి వెంకట స్వామి తెలిపారు. కేశవపట్నం శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎన్నికల సమావేశం జరిగింది. అధ్యక్షునిగా కోరెం శ్రీనివాస్‌రెడి, గౌరవ అధ్యక్షునిగా గోపు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సాగర్, నేరెళ్ల సంతోష్, పల్లె స్వరూప, ప్రధాన కార్యదర్శిగా బూర్ల వెంకటేశ్, సంయుక్త కార్యదర్శిగా కిరణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకటేష్, అధికార ప్రతినిధులు ప్రణదీప్, రంజిత్, ప్రచార కార్యదర్శి తుమ్మ సుధాకర్, కోశాదికారిగా అనిల్, కార్యవర్గ సభ్యులుగా రాకేశ్, సుధీర్, అనిత్, సంపత్‌రెడ్డి, గట్టయ్యలు ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

సన్మానం

హుజూరాబాద్: పట్టణంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో తెలంగాణ మాల మహానాడు మాల ఉద్యోగుల సంక్షేమ సంఘ నాయకులు నూతనంగా ఎన్నికైన హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కాయిత రాములు, కామని రవీందర్‌లను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో నాయకులు డాక్టర్ రాగం రమేష్,పొగరు స్వామి, పసుల స్వామి, తాళ్ల యాదగిరి,కుక్కట్ల ప్రతాప్,బీట్ల శ్రీనివాస్, జూపాక శ్రీనివాస్, జూపాక నర్సింగం, కత్తెరమల్ల సదానందం, కృష్ణారావు, కోడం నరసింగం, శ్రీరామ్ శ్రీధర్, ముక్క రమేష్ ఉన్నారు.

సన్నబియ్యం పంపిణీకి సన్నద్ధం



అవగాహన సమావేశంలో అధికారులు, డీలర్లు

గన్నేరువరం: ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీకి రేషన్ డీలర్లు సన్నద్ధంగా ఉండాలని డెప్యూటీ తహసీల్దార్ నరసింహచారి అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సన్నబియ్యం పంపిణీపై రేషన్ డీలర్లలతో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతినెలా రేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న బియ్యం నిల్వ ఉంటే వాటిని పంపిణీ చేయెుద్దని, సన్న బియ్యం పంపిణీ చేయాలని, సమయపాలన పాటిస్తూ, రేషన్ షాపుల్లో శుభ్రతను పాటించాలని తెలిపారు. ఆర్ఐలు రజినీకాంత్‌రెడ్డి, రఘు, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, వీరాకుమార్, సంపత్, బాపి, రమేష్, శంకరయ్య, ఆంజనేయులున్నారు.

విద్యార్థికి గాయాలు

మానకొండూర్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అశ్విత్ అనే విద్యార్థి దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. రాత్రి భోజనం చేసేందుకు గదిలోని మంచంపై నుంచి కిందికి దిగే క్రమంలో విద్యుత్ సరఫరా లేకపోవడం వలన ఇనుప రేకు కుడికాలుకు కోసుకుపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. ప్రస్తుతం విద్యార్థి కోలుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ జగన్నాథం తెలిపారు.

26న వేలం

గన్నేరువరం: గన్నేరువరం గ్రామ పంచాయతీ ఆధీనంలోని 17 దుకాణా సముదాయాలు, వారసంతకు 26న వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ అవరణలో ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనేవారు ముందుగా దుకాణా సముదాయాలకు రూ.10 వేలు, వారసంతకు రూ.5 వేలు అడ్వాన్స్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

అంగడి వేలం వాయిదా

జమ్మికుంట: మండలంలోని నాగంపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన అంగడి వేలం వాయిదా పడినట్లు పంచాయతీ కార్యదర్శి అంకూస్ తెలిపారు. ప్రభుత్వ నిర్ధారించిన వేలం ధర రాకపోవడంతో 27వ తేదీకి వేలం వాయిదా వేశామని, కొత్తగా వేలంలోపాల్గొనే వారు 26వ తేదీన రూ.50వేల డీడీ గ్రామ పంచాయతీకి సమర్పించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

రెడ్డి సంఘం ఎన్నిక

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడుగా రాపిరెడ్డి అజయ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఉత్కంటగా జరిగిన ఎన్నికల్లో ఆయన మూడు ఓట్ల తేడాతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఉపాధ్యక్షుడుగా ఇసుకొండ రమణారెడ్డి, చల్ల సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెల్మ బాపురెడ్డిలు ఎన్నికయ్యారు.

వినూత్న ప్రచారం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామపంచాయతీ సిబ్బంది ప్రమాదాలు జరగకుండా సోమవారం కేశవపట్నం బస్టాండ్ ఎదుట మైక్‌లో వినూత్న ప్రచారం చేశారు. వారసంతకు వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా కేశవపట్నం ఎస్సై రవి స్పీడ్ గేట్లు ఏర్పాటు చేయగా, మరో వైపు గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రమాదాల నియంత్రణకు మైక్‌లో ప్రచారం నిర్వహించారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్ట్



జమ్మికుంట: పోలీసుల అదుపులో ఆశా వర్కర్లు

హుజూరాబాద్: అసెంబ్లీ ముట్టడికి ఆశ వర్కర్ల యూనియన్ పిలుపునివ్వగా హైదరాబాద్‌కు తరలి వెళ్తున్నారన్న సమాచారంతో పట్టణానికి చెందిన ఆశా కార్యకర్తలను ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

జమ్మికుంట : పట్టణంలోని ఆశా వర్కర్లను పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వాలనే డిమాండ్‌తో సమస్య పరిష్కారం కోసం హైదరాబాద్‌కు వెళ్లకూడదనే పోలీసులు మందుస్తు అరెస్ట్ చేయడాన్ని తీవ్రగా ఖండిస్తున్నామన్నారు.

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల ఆశా వర్కర్లను పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేశారు. సోమవారం ఉదయం వేకువ జామున్నుంచే ఆశా వర్కరు చ లో హైదరాబాద్‌కు తరలివెళ్ళకుండా ఎస్సై బి రాజేశ్‌సిబ్బందితో కలిసి వారిని స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం విడుదల చేశారు. అరెస్టయిన వారిలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీలత, శ్వేత, శోభ, సుజాత, సుగుణ, లింగవ్వ ఉన్నారు.



చిగురుమామిడిలో...

తాళం వేసిన ఇళ్లలో చోరీ



వివరాలు సేకరిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్‌లో తాళం వేసిన ఇళ్లలో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన కవ్వ మణెమ్మ తోపాటు మరి కొందరు కొమురవెల్లి, ఐలవోని దైవ దర్శనానికి వెళ్లారు. ఆరిళ్లలో ఇంటి తాళాలు పగుల గొట్టి బంగారం, వెండీ ఆభరణాలు, నగదు, ద్విచక్రవాహనాలను దొంగలు ఎత్తుకెళ్లారు. కవ్వ మణెమ్మ, నాగండ్ల శ్రీనివాస్, చింత శ్రీనివాస్, కాసిడి పోసిరెడ్డి, కవ్వ బుచ్చమ్మ ఇళ్లలో సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండీ ఆభరణాలు నగదు ఎత్తుకెళ్లారు. దేవిడి రాజిరెడ్డి ఇంటి ముందున్న బైక్‌ను అపహరించారు. సోమవారం తెల్లవారుజామున ఇంటి తాళాలు పగుల గొట్టిన విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించారు. చోరీ జరిగిన ఇళ్లలో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, సీఐ వెంకటి, ఎస్సై రవి పరిశీలించారు.

పరామర్శ

చిగురుమామిడి: మండలంలోని రేకొండలో అనారోగ్యంతో మృతిచెందిన బోయిని చిలుకవ్వ మృతదేహానికి సీపీఐ కరీంనగర్, సిద్దిపేట జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్ నివాళి అర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు స్వామి, రాజయ్య, మండల కార్యదర్శి లక్ష్మారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాజయ్య, సృజన్‌కుమార్, మాజీ సర్పంచులు బాపురెడ్డి, అంజయ్య, లక్ష్మీనారాయణ, కొంరయ్య, అంజయ్య ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

గన్నేరువరం: వ్యవసాయ యాంత్రీకరణకు మహిళా రైతులు దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి సోమవారం రైతువేదికలో తెలిపారు. మహిళా రైతు పట్టాదారు పాసు పుస్తకం, ట్రాక్టర్‌కు సంబంధించిన ఆర్‌సీ మహిళ రైతు లేదా ఆమె భర్త పేరుపై ఉండాలన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్స్‌లు రెండు ఫొటోలతోపాటు దరఖాస్తులను ఆయా క్లస్టర్లలోని రైతు వేదికల్లో ఏఈవోలకు ఇవ్వాలని కోరారు.

‘అవగాహన లేకుండా మాట్లాడొద్దు’

జమ్మికుంట: కరీంనగర్‌లో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 8 ఎంపీ స్థానాలు గెలుచుకందని, బీఆర్ఎస్‌కు డిపాజిట్ రాలేదని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు సీట్లు గెలుచుకున్న ఆ విషయాన్ని కేటీఆర్ మరిచిపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ రోజురోజుకు ఉని కోల్పోతుందనే ఆవేదనతో కేటీఆర్ మాట్లాడుతున్నరని, రాబోయేది బీజేపీ ప్రభుత్వమని పేర్కొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : రాములు - 9160083195
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602934, 9951602933, 9951602824
Office mail : knrjagati@gmail.com